ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం దారుణం



క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు

దుగ్గిరాల: ప్రజల చేత ఓట్లు వేయించుకొని ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ అన్నారు. ఆదివారం దుగ్గిరాల మండలంలోని చుక్కపల్లివారిపాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు, చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాసరి అరుణ మాట్లాడుతూ సంవత్సరం దాటినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం దారుణం అన్నారు. పొరపాటున ఓటు వేసినందుకు ప్రతి ఒక్కరూ 5 సంవత్సరాలు ఇబ్బందులు తప్పవని అన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజలు ఇబ్బంది పడకూడదని కరోనా క్లిష్ట పరిస్థితిలోనూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు సకాలంలో అందించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్త బాబు మోసాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని, ఆ పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలి అనటం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం మంచి చేయడం మానేసి అరాచకాలు, అక్రమాలకు పాల్పడుతుందని, వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యాలు, దాడులు చేస్తుందని, అక్రమ కేసులు పెడుతున్నారని, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టి.శివగోపయ్య, ఎ.ధనుంజయ్, గ్రామ సర్పంచ్ దాసరి సుందరమ్మ, వైఎస్సార్‌సీపీ గ్రామ ప్రెసిడెంట్ బుర్రా సతీష్ కుమార్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జానీ బాషా, మహిళా అధ్యక్షురాలు ఫిలోమినా, పులగూర కమల రాజు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను నిరసిస్తూ ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. ఆదివారం చినకాకాని గ్రామంలో ప్రజా వేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు పెట్టడం ఆపివేయాలని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 5న మంగళగిరిలోని విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చార్జీల పేరుతో మరోసారి రూ.12 వేల కోట్లకు పైగా భారాన్ని ప్రజలపై వేసిందని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టాలని అన్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఒప్పందాన్ని రద్దు చేయకుండా స్మార్ట్ మీటర్లు బిగించే పనిలో పడ్డారని అన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మంగళగిరి రూరల్ మండల కార్యదర్శి జి.బాబు ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కాజ శివశంకరరావు, కౌలు రైతు సంఘం నాయకుడు టి.బ్రహ్మయ్య, సీఐటీయూ నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 5న విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను ప్రజలు జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని మేరికపూడి, నుదురుపాడు, రేపూడి, గొల్లపాలెం, వేములూరిపాడు, తక్కెళ్లపాడు, 113.తాళ్లూరు గ్రామాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుతో కలిగే అనర్థాలను వివరిస్తూ ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించి కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందని చెప్పారు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల పేరుతో పెరిగిన విద్యుత్ బిల్లులు కట్టలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారని తెలిపారు. దీనికి తోడు రూ.10 వేల నుంచి రూ.19 వేల వరకు ఖర్చయ్యే స్మార్ట్ మీటర్లు ప్రతి ఇంటికి బిగించాలని చెప్పడం దుర్మార్గమని అన్నారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ సంతకాల సేకరణ

మంగళగిరి: అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేటలో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వీవీ జవహర్‌లాల్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే విద్యుత్ వినియోగదారులపై భారం పడుతుందన్నారు. పీక్ అవర్స్‌లో అదనంగా వసూలు చేయడం జరుగుతుందన్నారు. సెల్‌ఫోన్ రీచార్జి లాగా కరెంట్‌కు కూడా రీచార్జి చేసుకోవాల్సి వస్తుందన్నారు. ఈ నెల 5న పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథం, కె.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్లపై వివరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు



తాడికొండ: ఓ వ్యక్తిపై ఐదుగురు యువకులు దాడి చేసిన ఘటనలో తుళ్ళూరు పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన తుళ్ళూరు మండలంలోని తాళ్ళాయపాలెం గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దున్నా బాలకోటయ్యపై అదే గ్రామానికి చెందిన యువకులు కిరణ్, నరేష్, రాజీ, ప్రవీణ్, మరియదాసులు గత రెండు రోజుల క్రితం దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో దున్నా బాల కోటయ్య తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్ళూరు పోలీసులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల ఏర్పాటు



దుగ్గిరాల: ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పి.నతానియేలు మాదిగ అన్నారు. దుగ్గిరాల గ్రామంలో ఆదివారం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అంనంతరం నతానియేలు మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షుల నిర్ణయం మేరకు ప్రతి గ్రామంలో నిర్మాణాత్మక కమిటీలను వేస్తున్నామని అన్నారు. ఈ నెల 22న జరగనున్న నూతన కమిటీల మహాసభ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వి.సుదీర్ మాదిగ, జి.కిరణ్ మాదిగ, వై.జ్యోతి మాదిగ, డి.సాంబయ్య మాదిగ, కె.నాగేశ్వరరావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు

ఎస్ఐ వెంకట్



మంగళగిరి: బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ హెచ్చరించారు. ఆదివారం రాత్రి ఎన్‌ఆర్ఐ ఆసుపత్రి వెనుక ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇక నుంచి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేఎల్‌యూలో స్కిల్ పలావర్ ప్రారంభం



లెర్న్‌థాన్ ప్రాజెక్టును నిపుణుల సహకారంతో ప్రారంభిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ డివిజన్ ఆధ్వర్యంలో స్కిల్ పలావర్ ప్రాజెక్టును విజయవంతంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ పలావర్ ప్రాజెక్ట్ ఆధారిత లెర్నింగ్ కార్యక్రమాన్ని బీటెక్, బీసీఏ, ఎంసీఏ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిందని అన్నారు. స్పెషలైజేషన్ ప్రొఫెషనల్ ఎలక్టివ్‌లు, ఇండస్ట్రీ అలైండ్ స్కిల్ కోర్సులకు అనుగుణంగా హ్యాకథాన్‌లను విద్యా విధానంలో భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవంతో కూడిన నైపుణ్యాలను అందించడమే లక్ష్యమని అన్నారు. స్కిల్ పలావర్ మూడు దశల విధానాన్ని అనుసరిస్తుందన్నారు. లెర్న్‌థాన్ పరిశ్రమ నిపుణుల చేత యదార్థ సమస్యలపై ఇంటరాక్టివ్ సెషన్లు, వర్చువల్ రివ్యూలు, సెమిస్టర్ మధ్యలో డొమైన్ నిపుణుల ద్వారా ప్రోగ్రెస్ ఈ వాల్యుయేషన్ చేయించడం వంటివి వివరించారు. సుమారు 1650 మంది ప్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ లెర్న్‌థాన్‌లో ప్రముఖ పరిశ్రమ నిపుణులు జి.అనిల్‌కుమార్ (సిస్కో), పి.తత్తమ్మదొర (ఐబీఎం), జి.నాగసాయిరామ్ (అన్సిస్), అనీష్ (అద్యా స్కిల్స్) తదితరులు విద్యార్థులకు సమస్యల సాంకేతిక అవరోధాలపై వివరణాత్మక శిక్షణ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమ మార్గదర్శకులుగా ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రామకృష్ణ రావు, సీఎస్ఈ, ఈసీఈ, ట్రిపుల్ ఈ, మెకానికల్, ఐవోటీ, బీసీఏ, ఎంసీఏ విభాగాల విభాగాధిపతులు సమన్వయ బృందంగా పనిచేశారని తెలిపారు. ఈ స్కిల్ పలావర్ మొదటి దశతో ప్రారంభమై రెండు దశలు ఆగస్టు నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, శాశ్వత మార్గదర్శకత్వం అందించారు.

తెనాలి ఫ్లై ఓవర్.. మందుబాబులకు అడ్డా



ఫ్లై ఓవర్ పై బీరు సీసాలు

మంగళగిరి: తెనాలి ఫ్లై ఓవర్ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. చీకటి పడినప్పటి నుంచి మందుబాబులు ఫ్లై ఓవర్‌పై మద్యం సేవిస్తూ హల్ చల్ చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు మందుబాబులు మద్యం తాగుతూ అటుగా వెళ్లే వాహనదారులు, మహిళలను కామెంట్‌లు చేస్తూ హేళన చేస్తున్నారు. యువకులు అధికంగా పుట్టిన రోజులు సైతం జరుపుకుంటూ తెల్లవార్లు అక్కడే అల్లరి చేస్తున్నారు. దీంతో చీకటి పడితే తెనాలి మీదుగా వెళ్లి, వచ్చే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు గస్తీ ఏర్పాటు చేసి యువకులను ఫ్లై ఓవర్‌పై పార్టీలు చేసుకోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

35వ రోజుకు చేరిన రిలే నిరసన దీక్షలు

పూలింగ్‌కు తీసుకుంటే రైతులకు రూ.కోటి పరిహారం, పూలింగ్ ప్యాకేజీ ఇవ్వాలి



35వ రోజు రిలే దీక్షలో నిరసన తెలియజేస్తున్న జంజనం కోటేశ్వరరావు, రైతులు, మహిళలు

తాడికొండ: ప్రభుత్వ రెండో దశ పూలింగ్‌ను వ్యతిరేకిస్తూ ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో కొనసాగుతున్న రిలే నిరసన దీక్షలు ఆదివారం 35వ రోజుకు చేరాయి. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రెండో దశ పూలింగ్ పేరుతో ఈ ప్రాంత రైతులను నిరాశ్రయులను చేసేందుకు కంకణం కట్టుకుందన్నారు. బంగారం లాంటి పంటలు పండే భూములను పూలింగ్‌కు ఇస్తే ఈ ప్రాంతంలో రైతులు, రైతు కూలీలకు గడిచేది ఎలా అని ప్రశ్నించారు. మొదటి దశలో ఇచ్చిన భూముల రైతులకు న్యాయం చేయకుండా రెండో దశ పేరుతో ప్రభుత్వం ముందుకెళ్లడం దుర్మార్గం అన్నారు. ఒక వేళ తప్పనిసరి పరిస్థితుల్లో పూలింగ్ చేయాలనుకుంటే ముందుగా భూమి ఇచ్చే రైతుకు రూ.కోటి పరిహారం అందించాక పూలింగ్ ప్యాకేజీ ప్రకటించాలన్నారు. ఈ ప్రాంతంలో భూములకు ధరలు బాగా పెరిగాయని, రైతులు తరతరాల నుంచి కాపాడుకుంటున్న భూములను కారుచౌకగా కొట్టేస్తే రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. పెట్టుబడుల పేరుతో బడా కంపెనీలతో కుమ్మక్కై చేస్తున్న ఈ తంతును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

మహంకాళీ ఆలయం వద్ద భక్తుల సందడి



రాగి నాణెములు వేస్తున్న భక్తులు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని కోటి లింగాల క్షేత్రంలో నిర్మాణ దశలో ఉన్న 40 అడుగుల పాతాళకాళీ ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పాతాళకాళీ విగ్రహ ప్రతిష్ఠ చేసే పీఠం కింద ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఉచితంగా ఇస్తున్న రాగి నాణెములు వేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కమిటీ సభ్యులు అందజేసిన రాగినాణెములు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మార్గం ద్వారా వేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు లక్ష్మీనారాయణ తెలిపారు. కోటిలింగాల క్షేత్రంలోని మహాకాళేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా టెంట్లు ఏర్పాటు చేసి మంచినీరు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలు అమ్మచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జ్ఞానప్రసన్నబాబా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు.


ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు



మాట్లాడుతున్న ఎంఈవో అలీమ్

మేడికొండూరు: మండల కేంద్రమైన మేడికొండూరు భవిత స్కూల్లో ఆదివారం అఖిల భారతీయ శిక్షా సమాగం ఐదో వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక అవసరాల బాలబాలికలకు మెడికల్ అసెస్మెంట్ సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యా శాఖ అధికారి షేక్ అబ్దుల్ అలీమ్ పాల్గొన్నారు. సమగ్ర శిక్ష గుంటూరు వారి ఆధ్వర్యంలో 0 నుంచి 18 సంవత్సరాల లోపు వయసు గల ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉచిత శారీరక అంగవైకల్య నిర్ధారణ భవిత స్కూలు ఉపాధ్యాయులు బి.సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను చులకనగా చూడకుండా వారు ఎంచుకున్న రంగాలలో రాణించే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు బిడ్డల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారిలో మనోధైర్యాన్ని నింపాలని సూచించారు. తాడికొండ నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నుంచి 95 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఈడీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఐఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారులు రామ్మోహన్, సాజిదా బేగం, నియోజకవర్గంలోని పలు మండలాల భవిత స్కూలు ఉపాధ్యాయులు బి.సుబ్బారావు, ఎస్.ఎలమంద, జ్యోతి, ఎస్.విజయలక్ష్మి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శతాబ్దకాలం పాఠశాల మూసివేయడం దారుణం




దుగ్గిరాల: చిలువూరు గ్రామంలో ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల మూసివేయడంతో పేద విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా ఉందని ఏపీ ఎమ్మార్పీఎస్ లీగల కన్వీనర్ చిలువూరు నాగరాజు అన్నారు. ఆదివారం చిలువూరు ఆర్‌సీఎం పాఠశాల విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ శతాబ్దకాలం పాటు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల మూసివేయడం ద్వారా పేద విద్యార్థుల భవిష్యత్ ఏంటి అని మండిపడ్డారు. దూర ప్రాంతాలలో కార్పొరేట్ విద్యను పొందలేక ఇబ్బందులకు గురవుతున్నారని, సమయానికి ఫీజులు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మండలంలో మేజరు పంచాయతీ మాదిగల ఓట్లు 1,500 పైబడి సుమారు మాదిగ జనాభా 3,000 పైగా ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్ర సర్వే నిర్వహించి పాఠశాల పునరుద్ధరించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, రామగిరి రాజు, డేవిడ్, ఆదిత్య, పొలు సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

10న రాత పుస్తకాలు పంపిణీ

తెనాలి: వైదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య, తెనాలి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన పేద బ్రాహ్మణ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేయనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి వెల్లడించారు. 10న మధ్యాహ్నం 3 గంటలకు నాజరుపేట అనుగోల వారి వీధిలోని విద్యాశంకర భారతి నృసింహసదన భవనంలో కార్యక్రమం జరుగనున్నట్లు తెలిపారు. సంబంధిత కరపత్రాన్ని ఆదివారం సమాఖ్య కార్యాలయంలో ఆవిష్కరించారు. పట్టణ, పరిసర గ్రామాల్లోని ఒకటి నుంచి పీజీ వరకు చదివే పేద బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రతి ఒక్కరికీ ఉచితంగా నోట్ బుక్స్ అందజేస్తామని తెలిపారు. మండల తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారని, భవన నిర్మాణానికి సహకరిస్తున్న కాశీనాథుని సుబ్రహ్మణ్యశాస్త్రిని అదే వేదికపై సత్కరిస్తామని వివరించారు. విద్యార్థులు ఈ నెల 8వ తేదీలోగా నోట్ బుక్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌరవాధ్యక్షుడు భాగవతుల కామేశ్వరరావు, కోశాధికారి తిరుమలరావు, ఉపాధ్యక్షులు కుందేటి వెంకట సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి టి.ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు కుందేటి ఉదయ నరసింహమూర్తి, అబ్బరాజు ఉదయ శంకర్, వలివేటి హర్ష వెంకట్, గౌరవ సలహాదారు పొడుగుపాటు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

17 నుంచి వారాహి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



తెనాలి: కొల్లిపర మండల గ్రామం కుంచవరంలోని పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ క్యాంపస్–2లో శ్రీవారాహి దేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆదివారం స్థానిక గంగానమ్మపేటలోని ది తెనాలి కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) ఆవిష్కరించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, ఎస్వీ యోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, సొసైటీ డైరెక్టర్ డీఎల్ చక్రధర చౌదరి, దేవస్థానం కమిటీ చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు, టి.నాగమల్లీశ్వరిదేవి, దేవతి భాస్కరరావు, హరిదాసు గౌరీశంకర్, గ్యాలం వేణు, శిల్పాల శ్రీనివాసు, గోపు రామకృష్ణ, మారుతీప్రసాద్, రాజేశ్వరరావు, గుర్రం హరికృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి



తాడేపల్లిరూరల్: ఏసీసీ కార్మికుల సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఏసీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికలకు ముందు తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు స్టీవెన్, ఎస్.సుబ్బారావు, తుపాకుల నాగేశ్వరరావు, నవనీతం, దుర్గమ్మ కూర్చొన్నారు. కార్యక్రమంలో ఆశీర్వాదం, ఎస్.దుర్గారావు, బాషా, సుబ్బారావు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

బదిలీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న బదిలీ కార్మికులు, ఎం బుక్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు చెంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. చెంగయ్య మాట్లాడుతూ కార్మికుల జీతాలలో ఏడాదికి రూ.కోటికి పైగా కాంట్రాక్టర్ దోపిడీ చేస్తున్నారన్నారు. వాస్తవంగా కార్మికులకు రూ.15,000 మున్సిపాల్టీ ఇస్తుందని, కాంట్రాక్టర్ రూ.10 వేలు మాత్రం ఇచ్చి రూ.5 వేలు దోచుకుంటున్నారన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.బాలాజీ, ఎస్.గణేష్, పుణ్యవతి, సిపార, రజని, కె.బుజ్జిబాబు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: పట్టణంలోని పలు ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గండాలయపేట, కొత్తపేట, ఆర్ అండ్ బంగ్లా రోడ్, హాస్పిటల్ రోడ్, మెయిన్‌బజార్, ఎయిమ్స్‌గేట్, ఎకో పార్కు ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తరలిరావాలి

మంగళగిరి: యూరియా కొరత కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేసేందుకు సోమవారం ఉదయం పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్దకు తరలిరావాలని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

గంగమ్మతల్లికి సారె సమర్పణ



మంగళగిరి: మండలంలోని యర్రబాలెం అడ్డరోడ్ ఆలా వారి గంగమ్మతల్లి గుడిలో సారె మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, బొట్టె ఆవులతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. మేళతాళాలు, కనక తప్పెట్లు, డీజేలతో గ్రామోత్సవం నిర్వహించారు.